ఆధార్ అప్డేట్ చేయించుకోండి

జివిడబ్ల్యువి ఇన్‌ఛార్జ్, సిపిఐ పట్నాయిక్

ప్రజాశక్తి- పాడేరు : ఆధార్ అప్ డేషన్ చేయించుకోవాలని జివిడబ్ల్యువి ఇంచార్జ్, సిపిఐ ఆర్ఎస్ పట్నాయిక్ కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో పాడేరు డివిజన్లో ఉన్న గ్రామ సచివాలయంలలో ఆధార్ క్యాంప్‌లో పాల్గొంటున్న ఆధార్ ఆపరేటర్లకు, సూపర్వైజర్లకు శనివారం పాడేరు ఎంపీడీవో కార్యాలయంలో ట్రైనింగ్ నిర్వహించారు. రాష్ట్ర ప్రతినిధి గిరిధర్ ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పట్నాయిక్ మాట్లాడుతూ, జిల్లాలో 3,59,580 మంది జనాభా ఆధార్ అప్డేట్ చేసుకోవాలసి ఉన్నందున, 73 సెంట్రల్ ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం గ్రామ సచివాలయంలలో జరుగుతుందని తెలిపారు. గిరిజన ప్రాంతంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆదార్, జివిడబ్ల్యువి, ఎస్‌బిసిసి జిల్లా కోఆర్డినేటర్లు వెంకట్, సునీల్, రమేష్ నాయుడు, ఆధార్ ఆపరేటర్లు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడంపై

మన్యంలో మిన్నంటిన ఆందోళనలు

గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యాన
భారీ ర్యాలీలు, రాస్తారోకోలు
ఆదివాసీ రిజర్వేషన్లకు సిఎం జగన్ తూట్లు : కిల్లో సురేంద్ర

అరకులోయలో...

అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ :బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఖండిస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు మండలాల్లో శనివారం ఆందోళనలు మిన్నంటాయి. సిపిఎం, గిరిజన సంఘం, టిడిపి నేతలు ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టారు. తీర్మానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు.

ప్రజాశక్తి -పాడేరు :జీఓ 3 రిజర్వేషన్‌పై అసెంబ్లీలో తీర్మానం చేయడంలో లేని శ్రద్ధ బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్పించడానికి జగన్ ప్రభుత్వానికి తొందర ఎందుకని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స ప్రశ్నించారు. గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పాడేరులో ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో ర్యాలీ చేపట్టి ప్రభుత్వ దిష్ట బొమ్మకు శవ యాత్ర నిర్వహించారు.తలార్ సింగ్ పెట్రోల్ బంక్ సమీపంలో ప్రభుత్వ దిష్టి బొమ్మ శవ యాత్రను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం అక్కడ నుండి ర్యాలీగా పాడేరు అర్.టి.సి కాంప్లెక్స్ చేరుకొని రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స మాట్లాడుతూ, బీసీ ఏ జాబితాలో ఉన్న బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో కలిపితే గిరిజనులకు ఉద్యోగ, ఉపాధ్యాయ, ఉపాధి రంగంలో నష్టం ఉంటుందని, రాజకీయ భవిష్యత్తు కూడా గిరిజనులకు ఉండదని తెలిపారు. జీవో 3 రిజర్వేషనుపై గిరిజన సలహా మండలిలో తీర్మానం చేసిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయడానికి అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేయడంలో లేని శ్రద్ధ, వీరిని ఎస్టీ జాబితాలో చేర్పించడంలో తన రాజకీయ ప్రయోజన పొందాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి లక్కు, సిఐటియు జిల్లా కార్యదర్శి వి.ఉమమహేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి ఎల్. సుందర్‌రావు, పోతురాజు, శంకర్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాపారావు, మత్యారాజు పాల్గొన్నారు.

మరో పోరాటం తప్పదు :గంగరాజు.

అనంతగిరి:బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానాన్ని వెనక్కి తీసుకోకుంటే మరో పోరాటం తప్పదని అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు హెచ్చరించారు. మండల కేంద్రంలోని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అనంతగిరి జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ,జగన్మోహన్ రెడ్డి రాజకీయ లబ్ధి కోసం ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీ తీర్మానం చేయడంతో గిరిజన ద్రోహి గా మిగిలిపోతారన్నారు.రాయలసీమ పాంతంలో 40 లక్షల జనాభా కల్గిన బోయ వాల్మీకిలు నాన్ షెడ్యూల్ ప్రాంతంలో నివసిస్తూ (బీసీ-ఏ) జాబితాలో ఉన్నారని వారికీ ఎటువంటి ప్రత్యేక భాషా, ఆచారాలు, సాంప్రదాయలు లేవన్నారు. వీరిపై ఉన్న అత్యుత్సాహం, ప్రేమ గిరిజనుల రక్షణ కవచంగా జిఓ -3 పై సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేసేందుకు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి జన్ని సుబ్బారావు, సోమేల నాగులు, అనంతగిరి వైస్ సర్పంచ్ పాంగి అర్జున్, వంతల బుద్రయ్య, సొవెరి వెంకటరావు, జన్ని బుజ్జిబాబు, జన్ని అప్పారావు, గోవర్ధన్ పాల్గొన్నారు.

పెదబయలులో...

అరకులోయ రూరల్:బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. శనివారం అరకు లోయ మండల కేంద్రంలోని గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ప్రభుత్వం డిగ్రీ కళాశాల నుండి అరకువేలి అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్డు జంక్షన్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, రాజ్యాంగా బద్ధంగా 5వ షెడ్యూల్లో ప్రాంతంలో ఆదివాసులకు కల్పించిన రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తూ సిఎం జగన్మోహన్ రెడ్డి తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. గిరిజన ప్రాంతంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న జీవో 3 పునరుద్ధరణ చేసి గిరిజన ప్రాంతంలో బ్యాక్ లాగ్ పోస్టులు, స్పెషల్ డిఎస్సి, జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, ఆదివాసి పరిరక్షణ సమితి జిల్లా కార్యదర్శి చట్టూ మోహన్, జనసేన పార్టీ అధికార ప్రతినిధి మాదల శ్రీరామ్, జనసేన నాయకులు దురియా సాయిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు సమర్ది బాబురావు, టిడిపి మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, సమర్ది మొసియా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

ముంచింగిపుట్టు:మండల కేంద్రంలోని వారపు సంతలో గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మిపురం సర్పంచ్ కె.త్రినాధ్, మండల వైస్ ఎంపీపీ1 సత్యనారాయణ మాట్లాడుతూ, బోయ, వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో పెట్టిన దుర్మార్గపు తీర్మానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ సామాజిక తరగతినైనా ఎస్‌టి జాబితాలో చేర్చాలంటే పలు కమిటీల నిబంధనల ప్రకారమే చేయాలన్నారు.బోయ, వాల్మీకులకు ఆదివాసీ తెగలతో వారికి ఎటువంటి సంబంధం, పోలికలు లేవన్నారు.వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ విధంగా ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా అధికార పార్టీ గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్పీటిసిలు, మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ రాజీనామా చేసి గిరిజన మనుగడను కాపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె నర్సయ్య, మండల కార్యదర్శి ఎంఎం శ్రీను, పి భీమరాజు, లైకోన్, దోంబ్రు, చందరయ్య, కొండయ్య, ఉప సర్పంచ్ గణపతి పాల్గొన్నారు.

పెదబయలు :మండల కేంద్రంలో సిపిఎం, టిడిపి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ,వైసీపీ ప్రభుత్వం 2024లో అధికారం కోసం ఇటువంటి తీర్మానాలు చేస్తుందని విమర్శించారు. అసెంబ్లీలో వైసీపీ ప్రభుత్వం తీర్మానాన్ని విరమించకపోతే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బొండా గంగాధరం, కుర్ర నర్సయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు వెచ్చంగి కొండయ్య, మాజీ ఎంపీపీ సేకరి వెంకటేష్, ఎంపీటీసీ బొంజుబాబు పాల్గొన్నారు

టిడిపి ఆధ్వర్యాన ర్యాలీ

అరకులోయ :బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రయత్నాన్ని వైసిపి ప్రభుత్వం మానుకోవాలని టిడిపి శ్రేణులు శనివారం అరకులోయలో ర్యాలీ, రాసారోకో చేటట్టారు. టిడిపి మండల అద్యక్షుడు శెట్టి బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, కిడారి శ్రావణ్ కుమార్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి, మాజీ ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యుడు అబ్రహం, పెద్దలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పి.దాసు బాబు మాట్లాడుతూ, అసెంబ్లీలో తీర్మానాలు ప్రవేశ పెడుతుంటే గిరిజన ఎమ్మెల్యేలు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు.గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపిలు వెంటనే రాజీనామాలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు దోన్నుదొర, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు అబ్రహం, మహిళ సీనియర్ నాయకురాలు బీబీ లక్ష్మి, పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ దాసుబాబు, స్టేట్ తెలుగు యువత ఆర్గనైజేషన్ కార్యదర్శి సాయిరాం, మాజీ వైస్ ఎంపీపీ పొద్దు అమ్మన్న, మాజీ ఫైనాన్స్ డైరెక్టర్ లక్ష్మి, మాజీ ఎంపీటీసీ బోరిబోరి లక్ష్మి, చందు పాల్గొన్నారు.

పాడేరులో ర్యాలీ చేపడుతున్న అప్పలనర్స, నాయకులు

వైసిపికి తగిని బుద్ధి చెబుతాం

రాజవొమ్మంగి : బోయ,వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన వైసిపికి గిరిజనులు తగిన బుద్ధి చెబుతారని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు హెచ్చరించారు. గిరిజన సంఘం ఆధ్వర్యాన శనివారం రాజవొమ్మంగిలో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి కొండ్ల సూరిబాబు, అధ్యక్షులు కె.జగన్నాథం, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ఆదివాసీ సంఘం నాయకులు బాలకృష్ణ, తాము సూరిబాబు, రాజు, శ్రీను, పాపారావు, బాబురావు పాల్గొన్నారు.

పలు చోట్ల రాస్తారోకోలు

చింతూరు : ఎస్టీ జాబితాలో చేర్చే తీర్మానం అసెంబ్లీలో పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన సంఘం జిల్లా నాయకుడు మడకం చిన్నయ్య ఆధ్వర్యంలో మండలంలోని లక్కవరంలో గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు.లక్కవరం గ్రామస్తులు వీరయ్య, హరీష్, నితిన్, ముత్తయ్య, అశోక్, గణేష్ పాల్గొన్నారు.

ఎటపాక : ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించి, ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కాకా అర్జున్ దొర మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ గిరిజనులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు.సంఘం నాయకులు బుద్దుల భద్రయ్య, సవలం రాము, నక్క సూరిబాబు పాల్గొన్నారు.

సీలేరు : ధారకొండ ఎంపిటిసి అపరంగి బుజ్జిబాబు ఆధ్వర్యాన జీకే వీధి మండలం శ్యామ గెడ్డ గ్రామంలో నిరసన తెలిపారు.

విఆర్.పురం:ప్రభుత్వం తీర్మానాన్ని ఉపసంహరించుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు హెచ్చరించారు. మండల కేంద్రం రేఖపల్లిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్‌లు సరోజిని, వెట్టి లక్ష్మి, సిపిఎం నాయకులు వడ్లది రమేష్, ప్రకాష్ రావు, కుంజ నాగిరెడ్డి, పులి సంతోష్ కుమార్, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో...

ఆపదమిత్రలకు సర్టిఫికెట్లు, కిట్లు అందజేస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ముగిసిన ఆపదమిత్రల శిక్షణ

ప్రజాశక్తి - రంపచోడవరం

స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్లో 11 మండలాలకు సంబంధించిన వందమంది సచివాలయాల ఆపద మిత్రలకు ఈనెల 12 నుండి 25వ తేదీ వరకు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఏజెన్సీలో పకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తక్షణ సహాయం చేసేందుకు ఆపదమిత్రలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 12 శాఖల ద్వారా ఏయే సహాయ కార్యక్రమాలు చేపట్టవచ్చో ఇక్కడి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం శిక్షణ పొందిన వందమందికి ఐడెంటి కార్డులు, సర్టిఫికెట్లు, పకృతి వైపరీత్యాల సహాయక చర్యలు చేపట్టేందుకు కిట్లు ప్రాజెక్ట్ అధికారి చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు, ఏడిఎం అండ్ హెచ్‌వో డాక్టర్ అనూష, డిటిఎంలు పి.వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, డిపిఎం కిరణ్మయి, వైటీసీ మేనేజర్ సుధీష్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలో చావడికోట పంచాయతీ పరిధిలోని బొడ్లంక బాలుర ప్రాథమికోన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తులసి దాస్ ఆధ్వర్యాన శనివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీపీ పల్లాల లక్ష్మి భూపతి రెడ్డి మాట్లాడుతూ ఈ స్కూల్లో చదువుకున్న అనేకమంది విద్యార్థులు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారని, ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారని తెలిపారు. పదవ తరగతి పరీక్షలు పరీక్షలు మంచిగా రాసి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రేమ కుమార్ రెడ్డి, మాజీ ఎంపిపి లక్ష్మీ భూపతి రెడ్డి, విద్యా కమిటీ సభ్యులు పి.ఆదినారాయణ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రాజ్ కుమార్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అతిథులను సన్మానించిన దృశ్యం

ఏజెన్సీలో క్రీడాభివృద్ధికి ప్రత్యేక కృషి

- ఎంపీపీ కారం లక్ష్మి
- సున్నం రాజయ్య మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

రిబ్బన్ కట్ చేసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి తదితరులు

ప్రజాశక్తి-విఆర్.పురం

ఏజెన్సీలోని క్రీడాభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయడం జరుగుతుందని ఎంపిపి కారం లక్ష్మి అన్నారు. మండలంలోని రేకపల్లి పంచాయతీ పరిధిలోని క్రికెట్ గ్రౌండ్లో మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపీపీ కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 రోజుల పాటు జరగనున్న ఈ టోర్నమెంట్‌లో 65 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలు అందజేయనున్నట్లు చెప్పారు. ఇందులో పాల్గొన్న ఎస్‌డిఎస్ ప్రాజెక్ట్ అధికారి గాంధీబాబు, విఆర్ పురం ఎస్సై దుర్గాప్రసాద్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆటలు ద్వారా యువతకు మంచి మార్గం అలవడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, చిన్నమటపల్లి ఎంపిటీసీ ప్రదీప్ కుమార్, పెద్దమటపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం నాయకులు వడ్లాది రమేష్, కుంజ నాగిరెడ్డి, ప్రకాష్, టోర్నమెంట్ నిర్వాహకులు, వివిధ మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు.

పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణంలో

స్థానికులకు 100 శాతం ఉపాధి కల్పించాలి

- అన్యాయం జరిగితే పార్టీలకతీతంగా పోరాటం
- జెఎసి ఏర్పాటు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం సీలేరు పార్వతినగర్ వద్ద ఎపి జెన్‌కో నిర్మించబోయే పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టులో ఉద్యోగ, ఉపాధికి సంబంధించి స్థానికులకు 100 శాతం మొదటి ప్రాధాన్యత కల్పించాలని ఆ గ్రామ ప్రజలు తీర్మానం చేశారు. పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణంపై ఏప్రిల్ 1న సీలేరులో ప్రజాభిప్రాయ సేకరణ జరపడానికి జెన్కో ఉన్నత అధికారులు నిర్ణయించి, పంచాయతీకి సమాచారం ఇచ్చిన నేపథ్యంలో శనివారం సీలేరు పంచాయతీ కార్యాలయం వద్ద ఇన్‌ఛార్జి సర్పంచ్ కె.వల్లిప్రసాద్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ పంపు స్టోరేజ్ ప్రాజెక్టు వల్ల స్థానికులకు, చుట్టుపక్కల గ్రామాలకు కలిగే నష్టాలపైనా, ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులకు సమర్పించవలసిన ప్రధాన డిమాండ్లపైనా చర్చించారు. స్థానికులకు 100 శాతం ఉపాధి కల్పించడంతో పాటు విద్య, వైద్యం, మంచినీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించాలని, పూర్వం నుండి నేటి వరకు తాత్కాలికంగా నిర్మించుకున్న ఇళ్లను శాశ్వత భవనాలుగా నిర్మించుకోవడానికి ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని, గ్రామస్తులకు ఇల్లుస్థలాలు కేటాయించాలని, ప్రాజెక్టు వల్ల ఏ విధమైన కాలుష్యంగాని, వాహనాలు రాకపోకలు సాగించేటప్పుడు ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, నిర్వాసితులకు భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు, షాపుకు షాపు ఇచ్చి ఆదుకోవాలని తదితర డిమాండ్లను రూపొందించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి సర్పంచ్ వల్లి ప్రసాద్ ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి మాట్లాడుతూ ప్రాజెక్ట్ నిర్వహణలో ప్రజలకు అన్యాయం జరిగితే పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఏకమై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఇటీవల జెన్కో హైడల్ డైరెక్టర్ సీలేరు పర్యటనకు వచ్చినప్పుడు గ్రామ పెద్దలతో సమావేశమై ప్రాజెక్టు ఏర్పడడం వల్ల వ్యాపారులు పెరుగుతాయని, ప్రజలకు ఎటువంటి నష్టం కలగదని వారు చెప్పారని వెల్లడించారు. స్థానిక నాయకుడు సదరం మారిబాబు మాట్లాడుతూ సీలేరులో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం ప్రధాన డిమాండ్‌గా చేర్చాలని కోరారు. అనంతరం అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఎస్‌టి, ఎస్‌సి అసోసియేషన్ నుంచి ఇద్దరేసి చొప్పున జేఏసీగా ఏర్పడి ఏకగ్రీవంగా గ్రామసభలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు కారే శ్రీనివాస్, ఎం.సత్తిబాబు వి.అప్పారావు, నక్క తిరుమలరావు, బొర్రా కృష్ణ, స్వర్ణలత, అంబికా వెంకట్రావు, నక్క జ్ఞానేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న జెఎసి నాయకులు

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి ఐవి

గుండాల ఇసుక ర్యాంపు అక్రమాలను అడ్డుకుంటాం

సిపిఎం మండల కార్యదర్శి ఐవి

ప్రజాశక్తి -ఎటపాక

గుండాల ఇసుక ర్యాంపు అక్రమాలను అడ్డుకుంటామని సిపిఎం మండల కార్యదర్శి ఐవి అన్నారు. శనివారం సిపిఎం మండల కమిటీ సమావేశం గొల్లగట్ట గ్రామంలో బుద్దుల భద్రయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసా, 1/70 చట్టాలను తుంగలోతొక్కి అక్రమ పద్ధతుల్లో గుండాల ఇసుక ర్యాంపును నిర్వహిస్తున్న వారికి కలెక్టర్, ఐటీడీఏ పీవో స్థానిక అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికారులు అక్రమ దారులకు సహకరిస్తూ గుండాల పంచాయతీకి తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ ఇసుక ర్యాంపుకు ఎటువంటి అనుమతులు లేవని, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర వే బిల్లులు చూపిస్తూ తెలంగాణకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న అక్రమార్కులను అరికట్టడంలో అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఇసుక ర్యాంపు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు డి.మాధవరావు, ఏ.రాము, కాక అర్జున్, సవలం రాము, నక్క సూరిబాబు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష సమావేశం శనివారం రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని అధ్యక్షతన ఎంపిపి కారం లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూనెం సరోజిని మాట్లాడుతూ రూ.65లక్షలతో 45 పనులకు సంబంధించి ఆడిట్ నిర్వహించారు. పనులు సక్రమంగా నిర్వహించేందుకు సమగ్ర నివేదికను తయారు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సోషల్ ఆడిటర్ ఆదినారాయణ, సచివాలయం సిబ్బంది, సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, ఆడిట్ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎంపిపి, అధికారులు

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణ

విద్యార్థుల ఆరోగ్యం అందరి బాధ్యత
ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజన విద్యార్థుల ఆరోగ్యాన్ని రక్షించే బాధ్యత అందరిపైనా ఉందని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ స్పష్టం చేసారు. టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు శుక్రవారం సాయంత్రం ఐటిడిఎ సమావేశ మందిరంలో వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థి సంఘాల లీడర్లతో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య రక్షణ, మరణాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్య సదుపాయాలు, పోషకాహారాలు సరఫరాపై సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ మాట్లాడుతూ ఇటీవల పాఠశాలల్లో జరుగుతున్న విద్యార్థుల మరణాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసారు. జువైనల్ జస్టిస్ ఆదేశాల మేరకు పాఠశాలల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆశ్రమాల్లో మెనూ అమలు, భద్రతా చర్యలు, విద్య, వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ఐటిడిఎలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, భవిష్యత్తులో మరింత విస్తరిస్తామని తెలిపారు. ప్రతీ నెలా 20 - 25 తేదీల మధ్యలో ఆశ్రమ పాఠశాలలు వసతి గృహాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి వైద్య సేవలు అందించడం జరుగుతోందన్నారు. తీవ్రమైన వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి జిల్లా ఆసుపత్రి పాడేరు, అరకు వ్యాలీ, చింతపల్లి ఏరియా ఆసుపత్రులలోను, ముంచంగిపుట్టు సామాజిక ఆసుపత్రులలో స్టూడెంట్ హెల్త్ సెల్ ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. సికిల్సెల్ ఎనిమియాను గుర్తించడానికి 54,730 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. వీరిలో 2,963 మందికి సోలబిలిటీ టెస్టులు చేయడం జరిగిందన్నారు. 15 మంది సికిల్ సెల్ ఎనిమియాతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి మెరుగైన వైద్యం అందించడంతో పాటు పింఛన్లు అందించడానికి అవసరమై చర్యలు చేపట్టామని చెప్పారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే అనే పుస్తకాన్ని అన్ని ఆశ్రమ పాఠశాలలకు పంపిణీ చేసామని దీనిపై సంబంధిత ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు అవగాహన ఉండాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాలలో సంఘాల సూచలను అమలు చేసే విధంగా సర్క్యులర్ జారీ చేయాలని టిడబ్ల్యూ డిడికి ఆదేశాలు జారీ చేసారు. ఈ సమావేశంలో ఎడిఎంహెచ్ఒ జమాల్ బాషా, జిల్లా ఆసుపత్రి సూపరింటెంట్ క్రిష్ణారావు, ఎటిడబ్ల్యూఒలు ఎల్.వెంకటరమణ, క్రాంతి కుమార్, మల్లిఖార్జున, , ఉపాధ్యాయ సంఘాల నేతలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, జిఎస్యు లీడర్లు, పలువురు ఎన్జిఒల ప్రతినిధులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలకు కార్యాచరణ

విద్యార్థులకు ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తున్న డిఇఒ చంద్రకళ (ఫైల్)

ప్రజాశక్తి- పిఎం.పాలెం : రాష్ట్రంలోనే అత్యధికంగా పదో తరగతి విద్యార్థులు కలిగిన చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ఉపాధ్యాయులు సిద్ధం చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెంచడంతో పాటు మిగతా వారు కూడా ఉత్తమ మార్కులు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నారు. గత ఏడాది ఆశించిన స్థాయిలో పది ఫలితాలు రాకపోవడం, సగానికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణులు కాక పోవడంతో ఈ ఏడాదైనా కష్టపడి శత శాతం ఫలితాలు సాధించేందుకు 'ప్రత్యేక ప్రణాళికతో బోధన' చేస్తున్నారు.

శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ...

పదవ తరగతి పిల్లల విషయంలో చదువు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ ఏడాదిలో ఐదు సార్లు పేరెంట్స్‌తో ఉపాధ్యాయులు సమావేశం ఏర్పాటుచేశారు. తల్లిదండ్రులందరూ ఈ సమావేశాలకు రాకపోవడంతో ప్రతి విద్యార్థి ఇంటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిశారు. పరీక్షల సమయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు.

ప్రత్యేక శిక్షణ తరగతులు

పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8:15 నుంచి 9:15 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5:30 వరకు ఏర్పాటుచేస్తున్నారు. సాయంత్రం వేళలో ఎక్కువ సమయం చదవటంతో విద్యార్థులకు ఆకలి ఇబ్బందులు ఎదురవ్వకుండా వీజ్గిస్ ఫౌండేషన్ సంస్థ ద్వారా దాతల సహకారంతో రెండు లక్షలకు పైగా విరాళాలు సేకరించి 865 మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. మంచి ఫలితాలు సాధించేందుకు రూ.1.60 లక్షలతో స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు.

ఉత్తమ మార్కులు సాధించేలా తర్ఫీదు
చంద్రంపాలెం పాఠశాలలో ఉపాధ్యాయుల కృషి

ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు...

గణితం, సైన్స్ పాఠ్యాంశాలపై దృష్టి

గతేడాది 764 మంది పరీక్ష రాయగా 388 మంది ఉత్తీర్ణులయ్యారు. మిగతా వారు సప్లిమెంటరీ పరీక్షలు రాయగా 234 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంలో 142 మంది ఫెయిలయ్యారు. గణితంలో 264 మంది, సైన్సులో 207 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా ఉండాలనే లక్ష్యంతో గణితం, సైన్సు పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి సారించి తర్ఫీదునిస్తున్నారు. ఎస్ఎ-1 పరీక్షలలో ఫలితాల ఆధారంగా విద్యార్థులను ఎ, బి, సి, డి గ్రేడ్లుగా విభజించి తర్ఫీదునిస్తున్నారు.

సందేహాలు తీరుతున్నాయి...

తరగతి గదిలో చెప్పే పాఠాలలో ఏదైనా సందేహాలు కలిగినప్పుడు వాటిని పాఠశాల ముగిసిన అనంతరం నిర్వహించే శిక్షణా తరగతులలో ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాం. దీంతో ఇంటికి వెళ్లి ఎటువంటి ట్యూషనూ లేకుండా చక్కగా చదువుకో గలుగుతున్నాను. పదో తరగతిలో మంచి మార్కులు సాధించగలుగుతాను.

- వినయ్ తేజ్,
పదవ తరగతి విద్యార్థి,
చంద్రంపాలెం పాఠశాల

ప్రణాళిక ప్రకారం చదువుతున్నా...

ఈ ఏడాది ఆరు పేపర్లు కావడం, అందులో సైన్స్ పేపర్ పార్ట్-ఎలో భౌతిక, రసాయనశాస్త్రం, పార్ట్-బిలో జీవ శాస్త్రం ఉండటంతో 3.15 గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తున్నారు. గతంలో రెండు పేపర్ల విధానం ఉండేటప్పుడు ఒత్తిడి లేకుండా పరీక్ష రాసేవారు. ఇప్పుడు రెండు పేపర్లు కలిపి ఒకే రోజు నిర్వహించడం వల్ల సమయం చాలదు. అందుకనే సమయాన్ని ప్రణాళికాయుతంగా మార్చుకుని పరీక్షలంటే ఆందోళన చెందకుండా మంచి మార్కులు వచ్చేలా ఉపాధ్యాయుల మార్గనిర్దేశంలో తర్ఫీదు పొందుతున్నాను.

- ఎస్.ప్రశాంతి,
పదోతరగతి విద్యార్థిని,
చంద్రంపాలెం ఉన్నత పాఠశాల

విద్యార్థులను దత్తత తీసుకున్నాం...

ఈ ఏడాది 865 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న 100 మంది ఉపాధ్యాయుల్లో ఒక్కొక్కరు తొమ్మిది మంది విద్యార్థులను దత్తత తీసుకొని ప్రత్యేక శ్రద్ధతో చదివిస్తున్నాము.

-ఎం.రాజబాబు
ప్రధానోపాధ్యాయులు,
చంద్రంపాలెం పాఠశాల

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

5న చలో ఢిల్లీ
సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు: మోడీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు శనివారం పాడేరు జిల్లా కేంద్రంలో సిఐటియు జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బిజెపి పాలన వచ్చిన నాటి నుండి కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కూలీలు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారని తెలిపారు. మోడీ విధానాలు ఆదాని, అంబానీల ఆస్తులు పెంచుకోవడం కోసమే ఉపయోగపడుతున్నాయని విమర్శించారు. ఢిల్లీ ప్రదర్శనలో ఐదు లక్షల పైగా పాల్గొంటారని తెలిపారు. అందరికీ కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని, కాంటాక్ట్, అవుట్సోర్సింగ్ పద్ధతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్ల అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గ్రామీణ ఉపాధి హామి కూలీలకు కనీస కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో 3కు చట్టబద్ధత కల్పించి, హైడ్రోపవర్ ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం చలో ఢిల్లీ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు పి.బాలదేవ్, అప్పలనాయుడు, సత్యనారాయణ, ఎస్వీ పోతురాజు, శంకర్రావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శివ, ప్రభుదాసు, ఏపీ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగమ్మ, మంజుల, లక్ష్మి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి -కంచరపాలెం : ఐసిడిఎస్ 1, 2 పరిధి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు అర్బన్ సిడిపిఒలు రమణకుమారి, శ్రీలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్బన్-1లో 3 ఆయా పోస్టులు, అర్బన్-2లో 7 ఆయా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థులు వెబ్ సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకొని తగిన నివాస ధ్రువపత్రాలతో అర్బన్ కార్యాలయాల్లో ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 3వ తేదీ లోపు సమర్పించాలని సూచించారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి : కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు అందుబాటులో ఉంటూ రోగులకు సేవలు అందించాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. శనివారం పాడేరు డివిజన్ ఫరిదిలోని 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ అధికారులతో కలక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలక్టర్ మాట్లాడుతూ, నాన్ కమ్యూనికబుల్ వ్యాధుల స్క్రీనింగ్స్ సక్రమంగా నిర్వహించి, సంబంధిత పోర్టల్ లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. తక్కువగా స్క్రీనింగ్ నిర్వహించిన మెడికల్ అధికారులను కారణాలు అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సి మెడికల్ అధికారులు క్రమం తప్పకుండా ఆరోగ్య ఉప కేంద్రాలను సందర్శించి, ఎఎన్ఎంలు, ఆశాలతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం పూర్తి స్థాయిలో ఇమ్మ్యునైజేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని, బిసిజి, ఒపివి, మీజిల్స్ తదితర అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. జనన రిజిస్టర్లలో పిల్లల వివరాలు నమోదు చేసి, హైరిస్క్ గర్భిణీల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణీలను ప్రసవాలకు ముందుగానే బర్త్ వెయిటింగ్ కేంద్రాలకు తరలించాలని సూచించారు. గర్భిణీల వివరాలు జనని సురక్ష యోజనలో అప్‌లోడ్ చేయాలని, వారికి అందాల్సిన పారితోషికం అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇక నుండి ప్రతి రెండు వారాలకు సమీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి ఆలస్యంగా హాజరైన ఆర్‌వి నగర్, సుంకరిమెట్ట, భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ అధికారులకు వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిఎంహెచ్ఓను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డిఎంహెచ్ఓ జమాల్ భాషా, జిల్లా క్షయ నియంత్రణాదికారి విశ్వేస్వర నాయుడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

పాఠశాల సందర్శనలో ఎంపిపి లక్ష్మి, తదితరులు

పాఠశాలలను సందర్శించిన ఎంపిపి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని కుంజవారి గూడెం, జల్లివారి గూడెం, టేకులూరు, కన్నపేట, సిరి గుంపు గ్రామాల్లో పాఠశాలలను ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం నాయకులు శనివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి ఆయా పాఠశాలల్లో సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పాత భవనాలు పెచ్చులూడిపోయి అస్తవ్యస్తంగా ఉన్నాయని, కొత్తగా భవనాలు నిర్మాణం చేసినా కిటికీలు, తలుపులు లేవని, ఫ్లోరింగ్ వేయలేదని పేర్కొన్నారు. ఇలా అయితే పిల్లల చదువులు ఎలా సాగుతాయని ప్రశ్నించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైనా నేటికీ విద్యార్థులు నేలపై కూర్చుని చదువుకొనే దుస్థితి ఉండటం బాధాకరమన్నారు. సిరిగుంపు పాఠశాలలో కొత్త భవనంలో ఇసుకలో కూర్చోబెట్టి చదువులు చెబుతున్నారన్నారు. పాఠశాలలో ఒకే ఒక టీచర్‌ను ఉంచడం వలన వారు సెలవు పెడితే సిఆర్‌పిలు వెళ్లి 2 పాఠశాలల్లో విధులు నిర్వహించాల్సి వస్తుందని తెలిపారు. తక్షణమే ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, సిరిగుంపు పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని, కిటికీలు, తలుపులు, ఫ్లోరింగ్ వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ములకనపల్లి సర్పంచ్ సవలం మారయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-విఆర్.పురం : రహదారి భద్రతపై మండల పరిధిలోని రేకపల్లి జంక్షన్‌లో శనివారం పోలీసులు యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపువారు, లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడుపుట, అతివేగం చట్ట విరుద్ధమని, అలా చేస్తే శిక్షార్హులని పేర్కొన్నారు. మొదటిసారిగా రూ.10వేలు జరిమానా లేదా ఆరు నెలలు శిక్ష, రెండో సారి దొరికితే రూ.15 వేలు జరిమానా లేదా రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ ఆరు నెలల పాటు రద్దు చేయబడుతుందని వెల్లడించారు. రహదారి భద్రతపై ఊరు ఊరు తిరుగుతూ అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు మాయం

ప్రజాశక్తి - మారేడుమిల్లి : మండల కేంద్రంలో నెల రోజుల నుండి ద్విచక్ర వాహనాలు వరుసగా చోరీలు జరుగుతున్నాయి. ఈ వారం రోజులుగా రెండు బైకుల అపహరణకు గురయ్యాయి. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఒకటి, ఏపీఆర్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఒకటి, హెచ్‌పి గ్యాస్ గొడౌన్ సమీంలో ఒకటి ఇటీవల కాలంలో చోరీ జరగ్గా, తాజాగా శనివారం ఉదయం ఏపీఆర్ స్కూల్ ఎదురుగా ఉన్న గుడి సమీపంలో పార్క్ చేసిన టీఎస్ 26డి 5479 నెంబర్ గల బైకును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. నిత్యం పర్యాటకులతో మండల కేంద్రం ఎప్పుడు రద్దీగా ఉంటుంది. దీంతో ఎవరు పర్యాటకులు, ఎవరు దొంగలో తెలియని పరిస్థితి నెలకొంది. సీసీ కెమెరాలు ఉన్నచోట్ల కూడా బైకులు చోరీకి గురికావడం పట్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రోన్లు నిషేధం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జి - 20 సదస్సు నేపథ్యంలో విశాఖలోని పలు మార్గాలను 'తాత్కాలిక రెడ్ జోన్'గా ప్రకటించామని, సదస్సు జరిగే సమయంలో డ్రోన్లను నిషేధించామని నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ శనివారం ప్రకటించారు. ఈ నెల 27 అర్ధరాత్రి 12 గంటల నుంచి మార్చి 31 రాత్రి 12 గంటల వరకు నిషేధం అమలవుతుందన్నారు.

మండలి ఫలితాలనంతర కదలికలు..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అధికార వైసిపి నేతలు చెప్పినట్లుగా 'సెమీ ఫైనల్స్' పూర్తయ్యాయి. అందులో ఓటమి చవిచూశారు. ఇంకా ఫైనల్స్.. 2024 సాధారణ ఎన్నికలే మిగిలి ఉన్నాయి. ఇప్పటి వరకూ ఓటమికి కారణాలను విశ్లేషించుకుంటూ రకరకాల అంశాలపై డిబేట్ నిర్వహిస్తూ ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు పలువురు నేతలు వెళ్లి కూర్చొని వచ్చారు. వారి లెక్క ప్రకారం ఫైనల్స్‌లోనూ సెమీ పోరు ఫలితమే ప్రతిబింబిస్తుందన్న ఆందోళన కనిపించింది. ఇది వైసిపి శ్రేణులను తాజాగా కలచివేస్తోంది. తాజా మండలి ఎన్నికల్లో తెలుగుదేశం చేతిలో అధికార పార్టీ ఘోర పరాజయం పాలవ్వడంతో వైసిపి నేతలంతా తలలు పట్టుకుంటున్నారు.

వ్యతిరేక ఓటుతో కొన్ని ప్రయోజనాలు

ప్రస్తుతం కనిపిస్తున్న ప్రభుత్వ వ్యతిరేక వాతావరణంలో బలంగా ఉండే ప్రధాన ప్రతిపక్ష రాజకీయ పార్టీకి ఓట్లేయడం ద్వారా ప్రభుత్వాన్ని భయపెట్టి తమ తమ ప్రయోజనాలను నిలబెట్టుకోవాలన్న కాంక్ష పట్టభద్రులైన ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో వ్యక్తమైనట్లు ఈ ఫలితాలు రుజువు చేస్తున్నాయి. మండలి ఫలితాల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెందిన ఎపిజిఎల్ఐ, ఎర్న్‌డ్‌లీవ్స్, పిఎఫ్‌కు సంబంధించిన పాత బకాయిలు కొన్నింటిని క్లియర్ చేయడం కూడా ఒక విజయంగానే వారు భావిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లోపు మిగతా బకాయిలన్నిటినీ క్లియర్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది.

ప్రభుత్వంపై వ్యతిరేక దెబ్బతోనే ఫలితం

ఈ నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థిత్వాల కంటే.. ప్రభుత్వ వ్యతిరేకతనే వీరంతా దృష్టిలో పెట్టుకున్నట్లు స్పష్టమవుతోంది. తొలుత టిడిపి విజయానికి ఒక సామాజిక తరగతే కారణమన్న రీతిలో ప్రచారం సాగింది. ఆ లెక్కన రాయలసీమ ప్రాంతంలో రెండు ఎమ్మెల్సీలకూ ఇలాగే వర్తింపజేసుకుంటే వైసిపియే గెలవాలి. ఎందుకంటే కొన్ని సామాజిక తరగతులు వైసిపినే అంటిపెట్టుకుని ఉన్నాయి. కానీ అక్కడ కూడా టిడిపియే గెలుపొందడం చూస్తే ప్రభుత్వంపై పట్టభద్రుల్లో అసమ్మతి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అంటే ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బలం, వైసిపి అభ్యర్థి బలహీనం అన్న ప్రచారంలో ఎంత మాత్రమూ నిజం లేదన్నది తేలిపోయింది..

దక్షిణం సెగ్మెంట్‌పై ప్రభావం

మండలి ఎన్నికలనంతరం నగరంలోని దక్షిణ నియోజకవర్గంపై చర్చ రాజకీయ తెరమీదకు వచ్చింది. తొలి నుంచీ ఇక్కడ పోటీకి సై అంటున్న సీతంరాజు సుధాకర్ మండలి ఎన్నికల్లోనూ ఓటమి పాలవ్వడంతో మరలా ఇటు దృష్టిసారించారు. రూ.కోట్లు ఖర్చు చేసి చేతులు కాల్చుకున్న ఆయన్ని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ నుంచి పోటీకి ఆయన అనుచర గణం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అదీగాక రాష్ట్రంలో తాజాగా శాసన సభ్యుల ద్వారా ఎమ్మెల్సీని ఎన్నుకునే ప్రక్రియ ఎంత క్లిష్టంగా మారిందన్నది అందరూ చూసిందే. దక్షిణం నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న (టిడిపి నుంచి గెలిచి వైసిపిలో చేరిన) వాసుపల్లి గణేష్‌కుమార్ ఓటు కోసం అధికార పార్టీ చాలా పెద్ద కసరత్తు చేసిందన్నది వైసిపి శ్రేణుల్లో తాజాగా చర్చనీయాంశమైంది. ఆయన్ని వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు స్వయంగా ఫ్లైట్‌లో జగన్ వద్దకు తీసుకెళ్లి ఒప్పించి తమ పార్టీ ఎమ్మెల్సీకి ఓటు వేయించుకున్నారట. ఇది వాసుపల్లికి త్వరలో మైనస్‌గా నిలవనుంది. వైసిపి హై కమాండ్ సైతం మండలి ఎన్నికలనంతర పరిణామాలపై కసరత్తు చేస్తోంది.

మండలి ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి సీతంరాజు ఓటమి చెందడంతో వాసుపల్లికి ఇబ్బందిగానే మారిందని చెప్పొచ్చు. హై కమాండ్ వద్ద సుధాకర్‌కు మంచి పేరుండడం వాసుపల్లికి మింగుడు పడని అంశంగా ఉంది. కొంతకాలంగా దక్షిణ నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాలతో తనకంటూ ఒక గ్రూపును ఏర్పాటు చేసుకుని సీతంరాజు సుధాకర్ దూసుకెళ్తుండడంతో వచ్చే ఎన్నికల్లో విశాఖలో 'సౌత్ వార్' తప్పదనిపిస్తోంది.

జి 20 సదస్సుతో విశాఖకు గుర్తింపు
జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే జి-20 సదస్సు ద్వారా విశాఖ నగరానికి ప్రపంచ స్థాయి గుర్తింపు లభించనుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని తెలిపారు. ప్రణాళికాయుతంగా వ్యవహరించి సమన్వయంతో ముందుకెళ్లి దేశం గర్వించేలా జి-20 సదస్సును విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ బ్రాండ్‌ను మరింత పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, సంబంధిత కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఒన్ ఎర్త్, ఒన్ ఫ్యామిలీ, ఒన్ ఫ్యూచర్ అనే థీమ్‌తో మూడు రోజుల పాటు జరిగే జి-20 సదస్సు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్, ఇతర అధికారులతో కలిసి శనివారం సాయంత్రం ఆమె కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సదస్సు విజయవంతంగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై, తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. సుందరీకరణ పనుల కోసం రూ.157 కోట్ల నిధులను వెచ్చించినట్లు ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పట్టణాభివృద్ధి, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ఎలాంటి సమన్వయ లోపం లేకుండా, ఇబ్బందులు కలగకుండా సదస్సును విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో భాగంగా జి-20 సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లు, షెడ్యూల్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మంత్రుల బృందానికి వివరించారు. ఈ నెల 27న కొంతమంది విదేశీయులు నగరానికి చేరుకుంటారని, 28న మిగిలిన వారందరూ విచ్చేస్తారని తెలిపారు. మూడు రోజుల పాటు ప్రధాన సదస్సు జరుగుతుందని వివరించారు. అతిథులకు స్వాగతం పలికే క్రమంలో పత్యేక సాంస్కృతిక బృందాలను ఏర్పాటు చేశామని, హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. 27న విచ్చేసిన అతిథులకు నగరంలోని కైలాస ప్రాంతంలో పర్యాటక ప్రదేశాలను చూపిస్తామన్నారు. 28న రాడిసన్ బ్లూ హోటల్లో ప్రధాన సమావేశం జరుగుతుందన్నారు. అనంతరం 3.30 గంటల నుంచి 6.30 వరకు మూడు రకాల సమావేశాలు జరుగుతాయని వివరించారు. రాత్రి 7.30 నుంచి 9.30 వరకు అదే హోటల్ సమీపంలోని బీచ్‌లో గాలా డిన్నర్ ఉంటుందని, దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్నారని తెలిపారు.

మాట్లాడుతున్న మంత్రి రజని

చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఎంపిపి శ్రీదేవి

వృద్ధుల చట్టంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - రంపచోడవరం : వయో వృద్ధుల చట్టం-2007, తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ, సంక్షేమంపై డివిజనల్ స్థాయి అవగాహన సదస్సు శనివారం రంపచోడవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బందం శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రోజుల్లో ఎక్కువమంది వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో వైసిపి ప్రభుత్వం అర్హులైన వృద్ధులకు ప్రతి నెలా 1వ తేదీన రూ.2750 పింఛను నేరుగా ఇంటివద్దకే వస్తుందని చెప్పారు. ఆర్టీసీ బస్సులలో వృద్ధులకు ప్రయాణ టికెట్ రాయితీ, రెండు సీట్లు కేటాయించడం, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక కౌంటర్లు నిర్వహించడం, స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా వృద్ధులకు వసతిగృహాలు నిర్వహించడం చేస్తున్నట్లు చెప్పారు. వయోవృద్ధుల కొరకు హెల్ప్ లైన్ నెంబరు 14567ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో అల్లూరి సీతారామరాజు జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధికారిణి మాధవి, ఎంపిడిఒ కుమార్ బాబు వైస్ ఎంపిపి కొమ్మిశెట్టి బాలకృష్ణ, ఎంపిటిసిలు తుర్రం వెంకటేశ్వర్లు దొర, వంశీ కుంజం, మండల వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కేసు వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

గంజాయి కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - సీలేరు : గంజాయి అక్రమ రవాణా కేసులు తప్పించుకొని పరారీలో ఉన్న నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జీకే వీధి సిఐ అశోక్ కుమార్ కథనం ప్రకారం... 2022లో ఒరిస్సా నుండి కారులో అక్రమంగా గంజాయి తరలిస్తుండగా ఆ రాష్ట్రానికి చెందిన అజయ్ కారా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన విపిన్ కుమార్ మౌర్యలను పోలీసులు అరెస్టు చేసి 80 కేజీలు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆ సంఘటనలో మరో నిందితుడు ఉత్తరప్రదేశ్‌కి చెందిన రాకేష్ కుమార్ యాదవ్ అలియాస్ లోడికుమార్ యాదవ్ తప్పించుకున్నాడు. డిటిసి సిఐ పి.వెంకటరమణ నేతృత్వంలో పోలీసు బృందం గాలింపు చర్యలు చేపట్టి నిందితుడిని పట్టుకున్నారు. శనివారం జీకే వీధి పోలీస్ స్టేషన్లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ అశోక్ కుమార్ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ వెంకటరమణను, పోలీస్‌లను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందించినట్లు సిఐ తెలిపారు.

ముగ్గురు ఇంటర్ విద్యార్థులు డిబార్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండల కేంద్రంలోని గురుకుల జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఫిజిక్స్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ముగ్గురు విద్యార్థులను అధికారులు గుర్తించి వారిని డిబార్ చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారి విజయ మోహన్‌రావు శనివారం తెలిపారు. శనివారం ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫిజిక్స్-1 పరీక్షలు రాస్తుండగా రాజమండ్రి ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా ముగ్గురు విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కి పాల్పడుతున్నట్లు గుర్తించారు. వారి వద్ద స్లిప్పులు లభించడంతో ముగ్గురిని డిబార్ చేసినట్లు విజయ మోహన్ రావు తెలిపారు.